పేదల చెంతకు వైద్యం.. సీఎం జగన్ ఆశయం

- 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి
- కొబ్బరితోట ఆరోగ్య సురక్షలో 575 మందికి వైద్య పరీక్షలు
- మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు నలుగురి తరలింపు


లబ్ధిదారులకు మందులు అందజేస్తున్న తోట పద్మావతి, రమణ, శ్రీనివాసరావు తదితరులు

అల్లిపురం : ప్రజల చెంతకే వైద్యసేవలను తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అన్నారు. భూపేష్‌నగర్ సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కొబ్బరితోట డాక్టర్ వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 575 మంది పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. వారిలో నలుగురుని మరింత మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. వివిధ విభాగాల నిపుణులతో ప్రజలకు పరీక్షలు నిర్వహించి, వారి సమస్య తీవ్రతను బట్టి మెరుగైన వైద్యం నిమిత్తం కార్పొరేట్ ఆస్పత్రులకు తరలిస్తున్నారని తెలిపారు. వారికి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధించే వరకు డాక్టర్ల పర్యవేక్షణ, వైద్య సదుపాయం కల్పిస్తున్నారన్నారు. వారికి అవసరమైన మందులు కూడా ఉచితంగా అందజేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించే ఈ సౌకర్యాన్ని వార్డు ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు.

బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం..

బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించారు. చిరుధాన్యాల వల్ల కలిగే లాభాలను వివరించారు.

ఈ కార్యక్రమంలో 33,34,35,41 వార్డుల క్లస్టర్ మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం, వార్డు సీనియర్ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, తాతబ్బాయి తదతరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐక్యతా దినోత్సవం


పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కౌన్సిల్ ప్రతినిధులు


పటేల్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న డాక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు

డాబాగార్డెన్స్ : భారతదేశ మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లబాయి పటేల్ జయంతిని ప్రభుత్వం ఐక్యతా దినోత్సవంగా ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం నగరంలోని హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ కార్యాలయంలో ఐక్యతా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి కౌన్సిల్ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ పటేల్ చేసిన కృషి అమోఘమని, న్యాయం కోసం తన పోరాటాన్ని సుదీర్ఘంగా కొనసాగించారన్నారు. దేశ ఉప ప్రధానిగా, హోం మంత్రిగా దేశానికి ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. ప్రత్యేక చిహ్నంగా గుజరాత్‌లో ఆయన భారీ విగ్రహాన్ని నెలకొల్పారని, ఆయన ఆశయ సాధనకు మానవ హక్కుల సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. వక్రమార్గాలకు వ్యతిరేకంగా, హక్కుల కోసం అందరికీ అవగాహన కల్పించడం ఆయన చేసిన సేవలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఎస్‌వీ రమణ, ఎంఏ సత్తార్, షేక్ ఇస్మాయిల్, మాధవి, గణపతి, గుండు అప్పలరాజు, మార్టిన్ పెరీరా, ఎస్ అప్పారావు, కామేశ్వరరావు, సూర్య శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి చికిత్సాలయంలో..

మహారాణిపేట : దేశ తొలి ఉప ప్రధాని పటేల్ 147వ జయంతి మంగళవారం మహారాణిపేట ప్రకృతి చికిత్సాలయంలో నిర్వహించారు. శ్రీ గాయిత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ప్రకృతి చికిత్సాలయం అధినేత డాక్టర్ ఎస్.లక్ష్మీనారాయణ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్, డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి, ఎస్.మహేష్, క్షీరాబ్ది దుతి, గేదెల శ్రీహరి, గౌరీ శంకర్, అప్పారావు, మంగ, రమణ, బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం.. పుణ్యకార్యం

అల్లిపురం : హిందూ ధర్మంలో అన్నదానానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అన్నారు. గీత్ సంగీత్ జంక్షన్‌లో డాల్ఫిన్ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా మంగళవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో తోట పద్మావతి పాల్గొన్నారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్నారు. ఆహారం లేనిదే ఏ ప్రాణి మనుగడ సాగించలేదన్నారు. అమ్మవారి దయతో సర్వ జగత్తుకు సంపూర్ణంగా ఆహారం సమకూరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆటోస్టాండ్ అధ్యక్షుడు నాగాల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు పి.రమణ, కార్యదర్శి డేవిడ్ రాజు, కమిటీ సభ్యులు దేవా, రాము, రిషు, అప్పారావు, బి.అప్పారావు, నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు లండా రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన


పాల్గొన్న మహిళా కళాశాల విద్యార్థినులు


సదస్సులో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి

డాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల వాణిజ్య విభాగం, ఐక్యూఏసీ, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీ మార్కెట్స్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి పాల్గొని మాట్లాడారు. యువత ఆర్థిక లావాదేవీల నిర్వహణలో సాంకేతిక అభివృద్ధి ఎప్పటికప్పుడు అవగాహన చేసుకుని నిత్య జీవితంలో అన్వయించుకోవడం ఎంతో అవసరమన్నారు. అనంతరం ఎన్‌ఎస్ఐఎం ట్రైనర్ ఎం.శ్రీను విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి వై. లక్ష్మి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ అరుణపద్మ, వాణిజ్య శాస్త్ర అధ్యాపకురాలు ఎస్. అనురాధ, ఎన్. నిర్మలాకుమారి, జి.నాగశాంతి తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ చేసిన ఏఎస్ఐకు సత్కారం


పదవీ విరమణ చేసిన ఏఎస్ఐ తులసిగిని సన్మానిస్తున్న సీపీ డాక్టర్ రవిశంకర్

దొండపర్తి : పదవీ విరమణ చేసిన ఏఎస్ఐ గుత్తుల తులసిగిని మంగళవారం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తన చాంబర్‌లో సత్కరించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. 1984లో మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన తులసిగి 2012లో హెడ్ కానిస్టేబుల్‌గా, 2018లో ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. విధి నిర్వహణలో పలు క్యాష్ రివార్డులు అందుకున్నారు. పదవీ విరమణ చేసిన తులసిగి, అతని కుటుంబ సభ్యులకు సీపీ శుభాకాంక్షలు తెలిపి పోలీస్ శాఖలో 40 ఏళ్ల సుదీర్ఘ సర్వీస్ చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. కుటుంబ సభ్యుల సమక్షంలో తులసిగిని సత్కరించి వీడ్కోలు పలికారు.

మాజీ ప్రధాని ఇందిరకు నివాళి


మహానేత వైఎస్సార్ ఆవిష్కరించిన విగ్రహం వద్ద ఇందిరమ్మకు నివాళులర్పిస్తున్న కొణతాల శ్రీనివాస్

డాబాగార్డెన్స్ : మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 39వ వర్ధంతిని పురస్కరించుకుని 38వ వార్డు పంజా జంక్షన్ సమీపాన గల ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళి కార్యక్రమం చేపట్టారు. సిటీ కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ కొణతాల శ్రీనివాస్ పాల్గొని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొణతాల మాట్లాడుతూ ఈ విగ్రహానికి ఓ ప్రత్యేకత ఉందని, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న హయాంలో ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పిల్ల అప్పారావు, కస్తూరి వెంకట్రావు, సూర్యనారాయణ, రమణమూర్తి, సుబ్బారావు పాల్గొన్నారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గొంప గోవిందరాజు నేతృత్వంలో సౌత్ జైల్‌రోడ్డు వద్ద గల ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కాకినాడ చినబాబు, బాషా, కె.సూర్యనారాయణ, వరాలమ్మ, న్యాయవాది శ్రీనివాసరావు, తోట వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సంక్షేమ బోర్డు సాధన



సీతమ్మధార జంక్షన్‌లో నినాదాలు చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార: ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దిన వేడుకలు మంగళవారం సీతమ్మధార జంక్షన్‌లో ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జె.వి.ప్రభాకర్ ఎర్రజెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను, ట్రేడ్ యూనియన్ హక్కులను బడా కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెడుతున్నారని మండపడ్డారు. డీజిల్, పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి కార్మికులకు ఆహార భద్రత లేకుండా చేస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ పరిశ్రమలను తెరిపించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. లేని పక్షంలో ప్రజాగ్రహానికి ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. నవంబర్ 26, 27 తేదీల్లో కార్మికులు, ఉద్యోగులు, రైతాంగం చేపట్టనున్న దేశవ్యాప్త ఆందోళనకు ప్రజలు సంపూర్ణ మద్దతివ్వాలని కోరారు. కార్మికులు, ఆటో డ్రైవర్లు సంక్షేమ బోర్డు సాధనకు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు జి.వామనమూర్తి, రావికృష్ణ, దాలినాయుడు, దుర్గారావు, అడ్డూరి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నాకవుట్‌కు సీనియర్ వుమెన్ జట్టు

విశాఖ స్పోర్ట్స్ : బీసీసీఐ సీనియర్ వుమెన్ క్రికెట్ నాకవుట్‌కు ఆంధ్ర జట్టు అర్హత సాధించింది. టీ20 ట్రోఫీ లీగ్ దశలో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఆంధ్ర మహిళా జట్టు ఐదింట విజయాలు సాధించింది. నవంబర్ మూడో తేదీనుంచి నాకవుట్ పోటీలు ప్రారంభం కానుండగా తొలి మ్యాచ్‌లో ముంబయ్‌తో తలపడనుంది. ఈ సందర్భంగా జట్టును ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్‌ఆర్ గోపినాథరెడ్డి అభినందించారు.

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

2న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో నవంబర్ 2న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ


సంతోష్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

అల్లిపురం : నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోణి దేవా సోదరుడు, 32వ వార్డు మహిళా అధ్యక్షురాలు వాసుపల్లి బంగారమ్మ అల్లుడు సంతోష్‌కుమార్ మంగళవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఎస్‌ఆర్ఎంటీ దరి సంతోష్ గృహానికి చేరుకుని నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రైలు ప్రమాద బాధితులకు పరామర్శ


మహారాణిపేట : రాయగడ పాసింజర్ రైలు ప్రమాదంలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిని సీబీఐ మాజీ జేడీ వి.వి.లక్ష్మీనారాయణ మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్‌ను కలిసి గతంలో జేడీ ఫౌండేషన్ తరఫున కొన్ని సేవా కార్యక్రమాలు చేశామని, ఆస్పత్రికి అత్యవసర సహాయం కావాలంటే జేడీ ఫౌండేషన్ నుంచి అందిస్తామన్నారు.

యోగసిద్ధాంజనేయుడికి ప్రత్యేక పూజలు



మురళీనగర్: సూర్యానగర్-2 జాతీయ రహదారిని ఆనుకుని వెలసిన యోగ సిద్ధాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అర్చకుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు సుందరాకాండ పారాయణం, సాయంత్రం భజనానంద హారతి సమర్పించారు.

కనులపండువగా అప్పన్న కల్యాణం


యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

బస్ షెల్టర్లు ఖాళీ చేయించిన ట్రాఫిక్ పోలీసులు



బస్‌షెల్టర్‌ను ఖాళీ చేయిస్తున్న టూటౌన్ ట్రాఫిక్ పోలీసులు

- ప్రయాణికులే వినియోగించాలని ఆదేశాలు జారీ
- ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరిక

సాక్షి ఎఫెక్ట్..

జగదాంబ : బస్సుల కోసం నిరీక్షిస్తూ ఇబ్బంది పడే ప్రయాణికుల ఇబ్బందులను సాక్షి దినపత్రికలో 'ఇదేం తంతు' బస్టాప్‌లో దుకాణాలు.. ఎండలో ప్రయాణికులు శీర్షికన సోమవారం ప్రచురించిన కథనానికి టూ టౌన్ ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. మంగళవారం సాయంత్రం ట్రాఫిక్ ఎస్సై కె. శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది బస్ షెల్టర్లను ఆక్రమించి చేస్తున్న వ్యాపారాలను తొలగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్టాపులను ప్రయాణికులే వినియోగించుకోవాలన్నారు. బస్టాపులను వ్యాపారులు ఆక్రమించుకోరాదన్నారు. మళ్లీ ఇటువంటి తప్పులు చేస్తే ఆక్రమణదారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీనికి ముందు సచివాలయ సిబ్బంది కూడా వచ్చి దుకాణాలు తొలగించాలని వ్యాపారులకు తెలిపారు.

ప్రజాదర్బార్, డయల్ యువర్ ఎమ్మెల్యేకు ఆదరణ


లక్ష్మీ టాకీస్ ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ : సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిర్వహిస్తున్న ప్రజాదర్బార్, డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాలకు ప్రజాదరణ లభిస్తోందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. మంగళవారం జీవీఎంసీ 39వ వార్డు లక్ష్మీ టాకీస్ వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో స్థానికుల నుంచి వినతులు స్వీకరించారు. ఫెర్రీవీధిలోని డాన్‌బాస్కో సంస్థలో శిక్షణ పొందిన మహిళలకు కుటుమిషన్ల పంపిణీ కోసం పోర్టు చైర్మన్‌తో మాట్లాడారు. ఎమ్మెల్యే చొరవతో ఉచితంగా విద్యనందుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు, కార్యకర్తలకు ఉచిత ఇళ్ల స్థలాల కోసం ఎమ్మెల్యే కలెక్టర్‌తో మాట్లాడారు. అనంతరం కొత్తగా పెన్షన్లు, రేషన్ కార్డులు కావాలని కోరిన వారి కోసం సంబంధిత అధికారులతో మాట్లాడారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆదుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో సౌత్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్‌ఖాన్, సిటీ సెక్రటరీ ఆదివిష్ణు, ఖాజావలి, వైఎస్సార్‌సీపీ స్టేట్ నాయకులు మాదాబత్తుల రమేష్, జిల్లా సీనియర్ నాయకులు సలీం, ఎర్రబిల్లి ప్రభాకర్, శ్యామ్, ఆది, సురేష్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

అధునాతన గ్రంథాలయం నిర్మించాలి


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న సమితి ప్రతినిధులు

సీతమ్మధార : విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ స్థలంలో అధునాతన గ్రంథాలయం నిర్మించాలని కేంద్ర ఇంధన శాఖ మాజీ కార్యదర్శి ఈఏఎస్ శర్మ ఆధ్వర్యంలో మంగళవారం పౌరులు, విద్యార్థులు, సమితి సభ్యులు, నిరుద్యోగులు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ జీవీఎంసీ నుంచి గ్రంథాలయ శాఖకు చెల్లించాల్సిన బకాయి సెస్‌ను తక్షణమే చెల్లించాలన్నారు. 13 ఏళ్లుగా ఎందుకు అలసత్వం వహిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు అండగా నిలబడాలని, స్థలాన్ని ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలన్నారు. విద్యా శాఖ అలసత్వంపై చర్యలు చేపట్టాలంటూ ప్లకార్డులతో నినాదాలు చేశారు. ఈ విషయాన్ని ఇప్పటికే లేఖ ద్వారా ముఖ్యమంత్రికి తెలియజేశామన్నారు.

10 నుంచి చెకుముఖి సంబరాలు

మధురవాడ: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి చెకుముఖి సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.కె. పరశురామ్ తెలిపారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఈ వేడుకలకు సంబంధించి పోస్టర్‌ను విద్యాశాఖ ఆర్జేడీ జ్యోతి కుమారి, డీఈవో చంద్రకళ, సర్వశిక్ష అభియాన్ డైరెక్టర్ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరశురామ్ మాట్లాడుతూ ఈ నెల 10న పాఠశాల స్థాయి, 30న మండల స్థాయి, డిసెంబర్ 17న జిల్లా స్థాయి, జనవరి 27, 28 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 8, 9, 10వ తరగతుల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు. చినగదిలి ఎంఈవో రవీంద్రబాబు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోటాన శ్రీనివాస్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు దేముడుబాబు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక భవనానికి ఆధునిక శోభ

- లిఫ్ట్ సదుపాయం కల్పన
- ప్రత్యేక ఆకర్షణగా వర్టికల్ గార్డెన్


పాత భవనం


నూతనంగా అభివృద్ధి చేసిన తర్వాత

ఏయూక్యాంపస్: చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఆంధ్రవిశ్వవిద్యాలయం పరిపాలనా భవనం ఆధునిక శోభను సంతరించుకుంది. దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ భవనానికి ఆధునిక వసతులను కల్పిస్తూ సుందరంగా తీర్చిదిద్దారు. నెల రోజులుగా జరుగుతున్న ఆధునీకీకరణ, భవన ఎలివేషన్ పనులు పూర్తయ్యాయి. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాద రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తిచేయించారు. చారిత్రక భవనం ప్రాధాన్యతను, విశిష్టతను పరిరక్షిస్తూ ఆధునిక వసతులను జోడించడం విశేషం.

వర్సిటీ పరిపాలన మొత్తం జరిగే ఈ భవనం కార్పొరేట్ కార్యాలయాలను తలపిస్తూ ఆధునికతతో ఉట్టిపడుతోంది. భవనంలో ఉన్న పాత కిటికీల స్థానంలో కొత్త యూపీవీసీ కిటికీలు, ప్లంబింగ్ లైన్లను పూర్తిస్థాయిలో మార్పు చేశారు. ఎలివేషన్ మార్పుచేసి, పెయింటింగ్ చేశారు. భవనాన్ని ఎలివేషన్ గ్లాస్ ఫేసిడ్ వర్క్‌తో కళాత్మకంగా తీర్చిదిద్దారు. ఏయూ ఆర్కిటెక్చర్ విభాగం ఆచార్యులు విశ్వనాథ కుమార్ దీనిని డిజైన్ చేశారు. ఏసీపీ షీట్స్ ఉపయోగించి భవనాన్ని ఎంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. భవనం లోపల నూతనంగా లిఫ్ట్ సదుపాయం ఏర్పాటు చేశారు. వృద్ధులు, దివ్యాంగులు సైతం సులభంగా వర్సిటీలోని అన్ని విభాగాలకు వెళ్లడానికి, అధికారులను కలుసుకోవడానికి వీలుగా నూతనంగా లిఫ్ట్ కల్పించారు. భవనం కింది, మొదటి అంతస్తుల్లో కారిడార్లలో నూతనంగా ప్రకాశవంతమైన లైటింగ్ ఏర్పాటు చేశారు.

వర్టికల్ గార్డెన్ ప్రత్యేక ఆకర్షణ

భవనం ఎలివేషన్‌లో ఉపయోగించిన ప్రత్యేకమైన గ్లాస్ వర్క్ , వర్టికల్ గార్డెన్ చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఆధునిక సొబగులు అద్దుతూనే ప్రకృతికి, పచ్చదనానికి తగిన ప్రాధాన్యత కల్పించారు. భవనానికి రెండు వైపులా వర్టికల్ గార్డెన్ ఏర్పాటు చేసి, వీటిలో వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు. అదే విధంగా భవనం రెండు వైపులా లాండ్‌స్కేపింగ్ చేస్తున్నారు.

నడక, పరుగు అలవాటు పెంచేందుకే ఫ్రీడమ్ రన్

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్‌లోని విశాఖపట్నం ఎంఎస్ఎంఈ - డీఎఫ్‌వో ఆధ్వర్యంలో ఏపీఐఐసీ ఐలా, వాసీవా, డీఐసీ సంయుక్తంగా ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 4.0ను నిర్వహించాయి. మంగళవారం ఆటోనగర్ వాసీవా భవనం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో 40 మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. ఎంఎస్ఎంఈ ఏడీ చంద్రమౌళి మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం, గాంధీ జయంతిల ప్రాముఖ్యతను పురస్కరించుకుని యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ 2020లో ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ ప్రారంభించిందని చెప్పారు. మెరుగైన ఆరోగ్యం, ఫిట్‌నెస్ కోసం ప్రజల్లో నడక, పరుగు అలవాటును పెంపొందించడమే ఈ రన్ లక్ష్యం అన్నారు. ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ నాల్గవ ఎడిషన్ ఈ సంవత్సరం స్వచ్ఛ భారత్, స్వాస్థ్య భారత్ థీమ్‌తో ఫిట్ ఇండియా స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్‌గా అక్టోబర్ 1 నుంచి 31 వరకు నిర్వహించినట్టు తెలిపారు. ఎంఎస్ఎంఈ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ బి.ఎ.ఎ.వి.ప్రభాకర్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధికారులు ఎస్.ఎల్.ఎన్. కుమార్, వీరయ్య, రేవతి, వినోద్, సుబ్బారావు, సన్యాసిరావు, ఐలా చైర్మన్ రఘు, వైస్ చైర్మన్ కోల్లి ఈశ్వరరావు, వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, డీఐసీ జీఎం సీహెచ్ గణపతి, ఫ్యాప్సీ అధ్యక్షుడు మురళీ కృష్ణ, వాసీవా ప్రతినిధులు రాంప్రసాద్, పర్చూరు ప్రభాకర్, అనార్‌బాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.